తాగునీటికి అవస్థలు

- వర్షాలకు పగిలిన వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి-జిమాడుగుల: మండలంలో బొయితీలి పంచాయతీ రొయ్యలగడ్డ గ్రామంలో వర్షాలకు మంచినీరు వాటర్ ట్యాంకు పగిలి పోయింది. వాటర్ ట్యాంక్ మరమ్మతుకు గురవడంతో మంచినీటి కొరత ఏర్పడింది. దీంతో, గ్రామస్తులు ఊట గెడ్డల్ని ఆశ్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మత్తులు చేయించాలని గ్రామస్తులు కోరారు.



పగిలిన వాటర్ ట్యాంకు

కలవరపెడుతున్న గోదారి!

వరద తగ్గినట్టే తగ్గి, మళ్లీ ఉగ్రరూపం

ఆందోళన చెందుతున్న వరద బాధితులు

ఇంకా పునరావాస కేంద్రాల్లోనే నివాసం

ప్రజాశక్తి-ఎటపాక : గోదావరి వరద ఉధతి తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతుండడంతో ముంపు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నదీ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు పెరుగుతూ వచ్చిన గోదావరి, బుధవారం ఉదయం నుండి తగ్గముఖం పట్టడంతో రెండవ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. కాగా బుధవారం రాత్రి వరకు తగ్గి నిలకడగా ఉన్న, గురువారం ఉదయం నుండి నెమ్మదిగా పెరుగుతూ భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి ప్రవహిస్తుంది. గురువారం రాత్రి 9 గంటలకు 49.5 అడుగులకు చేరుకుంటుందని భద్రాచలం సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. గోదావరి వరద వచ్చి తగ్గుతూ పెరుగుతూ ఉండటంతో పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చింతూరు: చట్టి జాతీయ రహదారి 30.వద్ద గురువారం తెల్లవారుజామున వరద నీరు క్రమేపీ తగ్గటంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మధ్యాహ్నానికి 48.1 అడుగులు ఉండగా మరల క్రమేపి తగ్గుతూ వచ్చింది. దీంతో అధికారులు రెండవ ప్రమాదక హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. మరల మూడు గంటల నుండి క్రమేపి పెరుగుతూ రెండవ ప్రమాద హెచ్చరికను చేరింది. 11,500 క్యూసెక్కుల నీరు మరల వచ్చి చేరుతుందని దీంతో 51 నుండి 52 అడుగుల వరకు గోదావరి నీటిమట్టం పెరగవచ్చని సిడబ్ల్యుసి అధికారులు వెల్లడించారు. చింతూరు వద్ద 40.26 అడుగులు శబరి నది వద్ద ఉండగా. కూనవరం గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గి 40.08 అడుగులకు చేరింది. గత రాత్రి డొంకరాయి జలాశయంలో 1037 అడుగుల సామర్థ్యం పెరగడంతో అధికారులు ఆరో నెంబర్ గేట్ ద్వారా రెండు అడుగుల మేర పైకి ఎత్తి 2200క్యూసెక్కుల నీటిని దిగువ కువిడుదల చేశారు. చుట్టుపక్కల గ్రామాలు చోటూరు మల్లె తోట. నర్సంపేట. ఏజీ కోడేరు. కల్లేరు. కొయ్యగోరు. కొమ్మూరు. ముకునూరు. మామిళ్లగూడెం. తదితర గ్రామాలకు ఇంకా పూర్తిస్థాయిలో రహదారులు వరద నీటి నుండి ఇంకా బయట పడలేదు. అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ డివిజన్ కేంద్రంలో ఉంటూ ప్రతిరోజు వడ్డెగూడెం, వీఆర్పురం, కూనవరం ముంపు మండలాలను పర్యవేక్షిస్తున్నారు.



విఆర్.పురం మండలం ఒడ్డుగూడెం నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న బాధితులు

విఆర్ పురం: శాంతించిన గోదావరి, శబరి నదులు మళ్లీ ఉప్పొంగటంతో వరద బాధితులు ఆందోళన చెందుతున్నారు, బుధవారం సాయంత్రం 45.2అడుగులుగా ఉన్న గోదావరి నీటిమట్టం, తగ్గినట్టే తగ్గి, మళ్లీ పెరుగుతోంది. పదిరోజులుగా ముంపులో ఉన్న గ్రామాలను, ఇళ్లను చూసేందుకు పడవలపై వెళ్లిన బాధితులు ఇళ్లల్లోకి విష పురుగులు చేరాయని, కొన్ని ఇళ్లు బీటలు తేలాయని ఆవేదన చెందుతున్నారు. మళ్లీ వరదనీరు పెరుగుతుండడంతో ఎక్కడ కూలిపోతాయోయనని కలవరపడుతున్నారు. పడిపోయిన ఇళ్లకు రూ.పదివేలు ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ దీనికి సరిపోతుందని అంటున్నారు.

తాము ఇళ్లనుంచి సురక్షిత ప్రాంతాలకు వచ్చేందుకు రూ.ఐదు వేలు నుంచి రూ. ఏడు వేల వరకు రవాణాచార్జీలు పెట్టుకుని వచ్చామని, తమ కష్టాలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాగా నాలుగురోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకున్న తమను ఎవరూ పట్టించుకోవడంలేదని మురుమూరుకు చెందిన అర్జున్‌దొర వాపోతున్నారు. మరపడవను కేటాయించినా డీజిల్ లేకపోవడంతో ప్రయోజనం లేని పరిస్థితి ఉందని అంటున్నాడు.

వరద పోయింది... బురద మిగిలింది..



చింతూరులో జాతీయ రహదారిలో తొలగిన వరద నీరు

- జాతీయ రహదారిపై రాకపోకలు పునరుద్ధరణ
- పారిశుధ్య పనుల్లో పంచాయతీ యంత్రాంగం, అధికారులు

చింతూరు.: వారం రోజులుగా భారీ వర్షాలు, వరదలతో నీటి ముంపులోనే ఉన్న మండలంలోని జాతీయ రాష్ట్రీయ రహదారులపై ముంపు ప్రభావం తొలగడంతో రాకపోకలు పునరుద్ధరణ జరిగింది. వరదల్లో చిక్కుకున్న వందలాది వాహనాలు ముందుకు సాగాయి. చిన్నాభిన్నమైన జనజీవనం మళ్లీ కుదుట పడుతోంది. సంత మార్కెట్ గ్రౌండ్ పూర్తిగా నీటమునగడంతో వారాంతపు సంత మొక్కుబడిగా సాగింది, రోడ్డుపైనే వ్యాపారులు దుకాణాలు పెట్టుకున్నారు. .

కూనవరం : దావరి తగ్గు ముఖం పట్టడంతో మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టారు పారిశుధ్య కార్మికుల సహాయంతో ఇఒపిఆర్‌డి రామాంజనేయ ప్రసాద్, సర్పంచ్ హేమంత్, సెక్రటరీ సురేష్ చేరిన బురదను తొలగించి, బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు. కూటూరు పంచాయితీ సంత సముదాయంలో పిచ్చి మొక్కలను తొలగించారు. చింతూరు ఐటిడిఎ పిఒ చొరవతో మరమ్మతులు చేయించిన ఇక్కడ ఉన్న సంత షెడ్లలో వరదల సమయంలో కొండల నుండి వస్తున్న కొండ రెడ్లు పునరావాసం పొందుతున్నారని సర్పంచ్ బొగ్గా వెంకమ్మ కార్యదర్శి శ్రీనివాసరావు హరి తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన

ప్రజాశక్తి-విఆర్ పురం: వరదముంపు బారిన పడిన రామవరం పంచాయతీ అడవి వెంకన్నగూడెం. రామవరం గ్రామాల్లో గురువారం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు. లోతా రామారావు ఆధ్వర్యంలో సిపిఎం మండల బృందం పర్యటించింది. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ ముంపు ప్రాంతాల ప్రజలు సొంతూళ్లను, ఇళ్లను వదిలి అడవిలో గుడారాలు వేసుకొని, పిల్లా పాపలతో జీవిస్తున్న దుస్థితిలోనూ వారికి ప్రభుత్వపరంగా ఎటువంటి సాయం అందక పోవడం, కనీసం నిత్యావసరాలైనా ఇప్పటివరకు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. అడవిలో విష పురుగుల మధ్య బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న వారికి పదిరోజులౌతున్నా కిరోసిన్, బియ్యం తాగునీరు బరకాలు, ఇతర నిత్యవసర సరుకులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఎంపిపి కారం లక్ష్మి మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి వరద బాధితులకు నిత్యావసరాలను సిపిఎం ఆధ్వర్యంలో అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు పూనం. నారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, సిపిఎం సీనియర్ నాయకులు కుంజ. నాగిరెడ్డి, కారం.సుందరయ్య, వడ్లాది.రమేష్, సిఐటియు నాయకులు లక్ష్మణ్, ఆదివాసీ గిరిజన సంఘం నేతసుబ్బారావు, పులి బుజ్జి, రాజు, తాతబాబు రెడ్డి, ప్రకాశరావు పాల్గొన్నారు



బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు

సమస్యలు తెలుసుకుంటూ...సాయానికి భరోసానిస్తూ..



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- చింతూరు: వరద బాధితులకు ఇబ్బందిలేకుండా వెనువెంటనే సహాయక చర్యలు చేపడతామనిజిల్లా కలెక్టర్ ఎయస్. దినేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని ఎజి.కోడేరు పంచాయతీ మల్లెతోట, ఉలుమూరు గ్రామాలలో పర్యటించారు. సమస్యలు తెలుసుకుంటూ,సహాయక చర్యలు అందిస్తూ జిల్లా కలెక్టర్ పర్యటన సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద ముంపు బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి ఒక్కో ముంపు మండలానికి ఒక ఐఎస్ అధికారిని నోడల్ అధికారులుగా ప్రభుత్వం నియమించిందన్నారు. మల్లెతోట, ఉలుమూరు గ్రామంలోని వరద బాధితులకు కూరగాయలు, బియ్యం, వంటనూనెతోపాటు టార్చ్‌లైట్, కొవ్వొత్తులు, పాల ప్యాకెట్లు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. వరద బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్, తగు చర్యలకు అధికారులను ఆదేశించారు. విఆర్ పురం మండలం వెళ్లే రహదారి రామవరం, చొప్పెల్ల మధ్యలో రోడ్డు మీదకు వరద నీరు రావడంతో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. మల్లె తోట, ఉలుమూరు గ్రామాల ప్రజలకు పోలవరం ప్రాజెక్టు ముంపు జాబితాలో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కలెక్టర్ దృష్టికి తేగా దీనిపై ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియపరచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట చింతూర్ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కావూరి చైతన్య, ఎఎస్‌పి రాహుల్ మీనా, తహశీల్దార్ నజీముల్లా, ఎంపిడిఒ రవిబాబు , పంచాయతీ కార్యదర్శి జి.జగజ్జీవన్‌రావు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలను పరిశీలన

విఆర్ పురం: మండలంలోని సున్నంవారి గూడెం, కన్నాయి గూడెం, చింతరేగుపల్లి, చిన్న మట్టపల్లి, గుండుగూడెం, సుస్టివారి గూడెం, అడవి వెంకన్నగూడెం, రామవరం గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్ ప్రశాంత్ కుమార్‌తోపాటు ఎంపిపి కారం. లక్ష్మి ఎంపిటిసి ప్రదీప్ కుమార్ స్థానిక సర్పంచ్ కారం. బుచ్చమ్మ పర్యటించారు. వరద బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. నిత్యవసర సరుకులు కిరోసిన్ బరకాలు దోమ తెరలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం టిడిపి నేతలు, విఆర్ పురం, సీఐ కూనవరం, విఆర్ పురం, ఎస్ఐలు, ఎస్‌డిఆర్ఎఫ్, బృందం, విఆర్ఒలు, పంచాయతీ సెక్రెటరీ తాతారావు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రాల పరిశీలనకు బోటులో వెళ్తున్న సబ్‌కలెక్టర్



మాట్లాడుతున పిఒ అభిషేక్

వంతెనలను త్వరితగతిన పూర్తి చేయాలి: పిఒ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో ఐటీడీఏ పీవో అభిషేక్ గురువారం పర్యటించారు. లక్ష్మీపురం, బుంగపుట్టు పంచాయతీలో దెబ్బతిన్న రహదారులు, వంతెనల పనులను డిసెంబర్ లోపు పూర్తి చేయాలని పిఒ అధికారులను ఆదేశించారు. బర్రిగూడ వంతెన పనులు, లక్ష్మీపురం పంచాయతీ కర్లాపోదోర్ గెడ్డ పై వంతెనను నిర్మించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చుట్టిగొంది వంతెన నిర్మాణానికి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. నిర్మాణ పనులు ప్రభుత్వ నియమ నిబంధనల పాటిస్తూ పటిష్టమైన నాణ్యతతో పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. అనంతరం లబ్బూరు గిరిజన సంక్షేమ బాలురు, ముంచింగిపుట్టు బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. పదో తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను పీవో బోధించారు. మండల కేంద్రంలోని పలు అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేశారు. గర్భిణీలు, బాలింతలు, ప్రీస్కూల్ చిన్నారులకు పోషకాహారాన్ని సక్రంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. శిథిలావస్థకు చేరిన అంగన్వాడి భవనాలు, మినీ సెంటర్లకు నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని ౧ ఐసిడిఎస్ సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహసిల్దార్, ఏఈలు పాల్గొన్నారు.



బియ్యాన్ని పంపిణీ చేస్తున్న అధికారులు

బాధితులకు బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి:తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో దెబ్బతిన్న సుమారు 22 గృహాలకు సంబంధించి ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు తమ శాఖ ద్వారా బియ్యం పంపిణీ చేయడం జరిగిందని స్థానిక తహసిల్దార్ టి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలుచోట్ల పూరి గుడిసెలు వర్షాలతో దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న గృహాల బాధితుల వివరాలను జిల్లా కలెక్టర్ కు పంపించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వీఆర్వో ఎస్ కృష్ణారావు, రెవిన్యూ సిబ్బంది ప్రసాద్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

- సిపిఎం నేతలు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రభుత్వ ఆసుపత్రులకు పూర్తిస్థాయి వైద్య సిబ్బందితో పాటు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం మెరుగు పరచాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. అనంతగిరి ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం సిపిఎం జెడ్పీటిసి, బృందం సందర్శించి తనిఖీ నిర్వహించారు. ముందుగా వైద్య సిబ్బందితో పాటు ఆసుపత్రిఞ మందులు, సౌకర్యాలపై వైద్య అధికారిణి జ్ఞానేశ్వరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్పిటిసి గంగరాజు మాట్లాడుతూ, ఆసుపత్రిలో నెలకు రెండు వేల మంది రోగులు ఓపి నమోదవుతుందని రన్నింగ్ వాటర్ సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. దీంతో మహిళలు డెలివరీ అయిన అనంతరం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.సింగిల్ ఫేజ్ కావడంతో లో వోల్టేజ్ కరెంటు సమస్య ఏర్పడుతుందని, రాత్రుల సమయంలో రోగులు ఆసుపత్రిలో ఉండేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. డెలివరీ సమయంలో కూడా ఇదే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అల్లూరి జిల్లా పరిధిలో ఉన్న అన్ని ఆసుపత్రులలో పూర్తిస్థాయి ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెలలో ఉమ్మడి విశాఖ జిల్లాలో జరిగే జిల్లా పరిషత్ సమావేశంలో ప్రస్తావిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం టోకురు సర్పంచ్ కిల్లో మొస్య సిపిఎం మండల కార్యదర్శి ఎస్, నాగులు పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జెడ్‌పిటిసి గంగరాజు, సిపిఎం నేతలు

41 ఎకరాల్లో పంటలకు నష్టం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో వాటిల్లిన పంట నష్టాలను జిల్లా వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి నందు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రమేషకుమార్ మండలంలో గురువారం పర్యటించారు. తూటంగి, లైగండ, అరమ పంచాయతీల్లో సందర్శించి వరి, మొక్కజొన్న, వేరుసెనగ, అల్లం, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 41 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, వర్షాలు తగ్గుముఖం పడితేనే పూర్తిస్థాయిలో పంట నష్టాలను అంచన వేయగలమని వారన్నారు. వర్షాల నేపధ్యంలో వరి పంట నాట్లు వేయవద్దని, వర్షాలు తగ్గుముఖం పడితే వరినాట్లు వేసుకోవాలని గిరిజన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని నీలవేణి, మండల ఉద్యానవన శాఖ అధికారిని శిరీష, సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

అవార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అరకులోయరూరల్:దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థల నుండి జాతీయ స్థాయి అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి, అల్లూరి జిల్లా దివ్యాంగుల వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ బి.ధర్మ ప్రకటనలో తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ నేషనల్ జస్టిస్, ఎంపవర్మెంట్ ఈ అవార్డులను అందజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 31వ తేదీలోపు www.depwd.gov.in.ýñ<Š www.awards.gov.in వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్లు/నామినేషన్లు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే అనుమతిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభా వంతుల దినోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు.



పంటలను పరిశీలిస్తున్న అప్పలనర్స, నాయకులు

బాధిత రైతులను ఆదుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి -జి.మాడుగుల: తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జి.మాడుగుల మండలం గెమ్మిలి పంచాయతీ మద్దుల బంద గ్రామాల్లో తుపాన్‌తో దెబ్బతిన్న పంటలను సిపిఎం ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. మద్దుల బంధలో సుమారు 20 ఎకరాల భూముల్లో పంట తుపాన్ ప్రభావంతో నష్ట పోయిందన్నారు. వరి నాట్లు వరదలకు కొట్టుకొని పోయాయన్నారు. కొన్ని పొలాల్లో వరి పంటల్లో ఇసుక, మట్టి మేట వేసిందన్నారు.గ్రామాల్లో కనీసం అధికార యంత్రాంగం పర్యటన కూడా నిర్వహించలేదని తెలిపారు.. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల మండల కార్యదర్శి ఎస్.ధర్మాన పడల్, నాయకులు చిన్నారావు, వరహాల బాబు, విరాన్న పడాల్ తదితరులు పాల్గొన్నారు.



విరిగి పడిన విద్యుత్ స్తంభం ఇదే..

పశువుల పాకపై విరిగిపడిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షంతో చెట్టు కొమ్మలు, విద్యుత్ స్తంభాలు విరిగి పడుతున్నాయి. మండలంలోని అడపాల గ్రామంలో కిలో సీతారాం పశువులపాకపై విద్యుత్ స్తంభం విరిగిపడటంతో పూర్తిగా ధ్వంసం అయ్యింది. మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయం భవనంపై చెట్టుకొమ్మ విరిగి పడింది. పశువులపాక ధ్వంసమైన బాధిత గిరిజనుడు సీతారాంకు ఆర్థికంగా సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా అధ్యక్షుడు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

వ్యాధులతో మేకలు, గొర్రెల మృత్యువాత

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని బోయితిలి పంచాయతీ వాసవీది గ్రామంలో వారం రోజుల వ్యవధిలో పలు రకాల వ్యాధులతో మేకలు, గొర్రెలు మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు...తల్లి కొత్తన్నకు చెందిన నాలుగు, పరదేశి ధర్మారావుకు చెందిన రెండు, తల్లి అప్పన్నకు చెందిన మూడు, బుటారి ప్రసాదరావు- 2, బుటారి వెంకటేశ్ 3, తల్లి రామలింగంకు చెందిన ఒకటి మూగజీవాలు మృతి చెందాయి. ప్రభుత్వం గుర్తించి నష్టపరిహారం అందించాలని వారు కోరారు.

27న ఆర్ఐటిఐలో రెండో విడత కౌన్సెలింగ్

- ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ రాజారావు



ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటిఐలో ఈనెల 27న రెండవ విడత ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నామని చింతపల్లి ప్రభుత్వ ఆర్ఐటిఐ ప్రిన్సిపల్ కే.రాజారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 27న ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్:9866108607, 9494377 833 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా సూచించారు.

నర్సీపట్నం బస్ కాంప్లెక్స్‌లో..
అల్లరి మూకలను అరికట్టాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థుల ముసుగులో అల్లరి మూకలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వీరిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.గీతాకృష్ణ కోరారు. ఈ మేరకు గురువారం నర్సీపట్నం టౌన్ ఎస్ఐలు ఉమామహేశ్వరరావు, సుధాకర్‌లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులను పలు ఇబ్బందులకు గురి చేయడం జరుగుతుందన్నారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల సమయంలో విద్యార్థులను అల్లరి మూకలు ఇబ్బందులకు గురి చేయడంతో పాటు గొడవలకు దిగుతున్నారన్నారు. బైకులపై వేగంగా వెళుతూ భయాందోళనకు గురి చేస్తున్నారని చెప్పారు. కొంత మంది విద్యార్థులపై దాడులకు దిగుతున్న పరిస్థితి ఉందన్నారు. బైక్‌లపై తిరుగుతున్న విద్యార్థులను దూషించడం, ఎదిరిస్తే వారిపై దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. అల్లరి మూకలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ రాజు, డివిజన్ సభ్యులు జ్ఞానేశ్, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా రంపచోడవరం డివిజన్లో చింతూరు, కూనవరం తదితర వరద ప్రభావిత మండలాల్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పర్యవేక్షణలో అధికారులు వరద బాధితులకు సహాయక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నారు.చింతూరు, కూనవరం, వి. ఆర్. పురం ఎటపాక మండలాల్లో కమాండ్ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసారు. చింతూరు లో సెంట్రలైజ్డ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. చింతూరు డివిజన్ ఫరిధిలోని నాలుగు మండలాల్లో 149 పునవాన కేంద్రాలను ఏర్పాటు చేసారు. ఇప్పటివరకు సుమారు 1175 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని (ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి) అడ్వాన్స్ గా పంపిణీ చేసారు. సుమారు 34వేల కిలోల కందిపప్పు, 34 వేల లీటర్ల పామోలిన్ ఆయిల్ పంపిణీ చేసారు. 5,300 టార్చ్ లైట్లు, 25 సోలార్ లైట్లు, 20 వేల కొవ్వొత్తులు, 12 వేల కేజీల ఉప్పు ప్యాకెట్లు కొనుగోలు చేసారు. 127 వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 3630 మందికి చికిత్సలు అందజేశారు. ముంపుకు గురైన 190 అంగన్వాడి కేంద్రాలలో గర్భిణిలు, మూడు నుండి ఆరు నెలల బాలింతలు, ఏడు నెలల నుండి మూడేళ్ళ చిన్నారులకు పూర్తి అనుబంధ ఆహారాన్ని అందిస్తున్నారు. 80 మంది పారిశుధ్య కార్మికుల సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారు. సుమారు 59 వేల కేజీల సున్నం, 21 వేల కేజీల బ్లీచింగ్, 140 లీటర్ల ఫినాయిల్ సిద్ధం చేసి పారిశుధ్య నిర్వహణ పనులు ముమ్మరంగా చేస్తున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచండి

పాడేరు : వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. పంచాయతీ అధికారులు, ఎం.పి.డి.ఓలు, ఇఓపిఆర్డిలు, ఐసిడిఎస్ అధికారులతో గురువారం చింతూరు నుండి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, రెవెన్యూ, ఎం.పిడి ఓలు, ఇ ఓ పి ఆర్ డిలతో మండల, గ్రామ స్థాయిలోను కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. తప్పని సరిగా ఫ్రై డే డ్రై డే నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, జిల్లా మలేరియా అధికారి తులసి, ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలలో గురువారం మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి బాల్యవివాహాలు, మేనరిక వివాహాలతో అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం భేటీ బచావో -భేటీ పడావోలో భాగంగా విద్య ఆవశ్యకతను వివరించారు. చదువు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎలా తీసుకు వెళతుందో తెలియజేసారు. సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హెల్ప్ లైన్ నంబర్ ఎలా ఉపయోగించి తమను తాము ఎలా రక్షించుకోవాలో వీడియో చూపించి అవగాహన కల్పించారు. ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ, ఆడపిల్లల రక్షణ చట్టాలను వివరిస్తూ ఆకర్షణలకి లొంగిపోకుండా ఉండాలని సూచించారు.భవిష్యత్తు ను ఉన్నతంగా తీర్చిదిద్దు కోవాలని విద్యార్థులకు తెలిపారు. సీడీపీఓ కేబి సిహెచ్ బాలమణిదేవి, సూపర్వైజర్ కే.హైమావతి, మహిళా పోలీస్ సత్యవతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

విద్యార్థుల్లో సహజ సామర్థ్యాలను గుర్తించాలి



మాట్లాడుతున్న విజయభాస్కర్

ప్రజాశక్తి-పాడేరు: విద్యార్థుల్లో వారి సహజ సామర్థ్యాలను గుర్తించి ప్రతిభ నైపుణ్యాలను మరింత పెంపొందించాలని విద్యాశాఖ విశాఖపట్నం జోన్ వన్ ప్రాంతీయ సంచాలకులు విజయభాస్కర్ సూచించారు. స్థానిక శ్రీ కృష్ణాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాలలో టీచ్ టు టూల్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సానుకూలమైన ప్రవర్తన కలిగి ఉన్నప్పుడే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల మూర్తిమత్వాన్ని గుర్తించాలని సూచించారు. ఉపాధ్యాయుని బోధనలో విద్యార్థి పట్ల గౌరవప్రదమైన ప్రవర్తన కలిగి ఉండాలనే ప్రధాన ఉద్దేశంతోనే ఈ టీచ్ టూల్ కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, మండల మండల విద్యాశాఖ అధికారులు విశ్వ ప్రసాద్, సరస్వతి దేవి పాల్గొన్నారు.

అంతర పంటల సాగుపై అవగాహన

ప్రజాశక్తి - నాతవరం: మండలంలోని చమ్మచింత గ్రామంలో ఫామ్ ఆయిల్ సాగు, అంతర పంటలపై గురువారం అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ నీడలో పామాయిల్ పంటలో అంతర పంటగా సాగు, ఎలా నాటాలి, దాని ఉపయోగాలపై రైతులకు తెలియజేశారు. అడం అగార్వుడ్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, సీఈవో అగార్వుడ్ ప్రసాద్ సంపంగి, ఎండి పాలూరు రాంబాబు, ఏరియా ఈడి రాజలక్ష్మి, సభ్యులు కే. కోటేశ్వరరావు, టిడిపి నేత సత్య నారాయణ పాల్గొన్నారు.

ఇసుక, మెటల్ కొరతపై ధర్నా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతను పరిష్కరించాలని అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం(సిఐటియు) అద్వర్యంలో గురువారం నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, గత నలబై రోజులుగా ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతతో నర్సీపట్నంలో నిర్మాణ పనులు మందగించాయన్నారు. దీంతో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నర్సీపట్నం ఇసుక యార్డులో ఇసుక అక్రమాలు జరిగాయని, విచారణ జరిపి నిర్దారించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అదికార్లను అదేశించినా నేటికి ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో, యార్డులో ఇసుక ఉన్నా నర్సీపట్నం ప్రాంతంలో నిర్మాణదారులు తీవ్రమైన కొరతను ఎదుర్కోంటున్నారన్నారు. కాంక్రీట్ మెటల్ సరఫరా కూడా అగిపోయిందని తెలిపారు. దీంతో నిర్మాణాలు నిలిచి పనులు లేక భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులకు గురవుతన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో తక్షణమే స్పందించి ఇసుక, కాంక్రీట్ మెటల్ కొరతను పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా అధ్యక్షులు కె.రామకృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్తిబాబు, డి.శివ, గోవింద్, పెంటేష్, బద్రం, సత్తిబాబు,తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి కొమ్ముకాస్తున్న రెవెన్యూ అధికారులపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ, విశాఖ సిరిపురంలో 500 కోట్ల విలువ చేసే సాంఘిక సంక్షేమ శాఖ భూమిని కబ్జా చేసిన మత బోధకుడుపై చట్టపరమైన చర్యలు తీసుకుని కబ్జాకు గురైన భూమికి రక్షణ కల్పించాలన్నారు. విలువైన భూములపై కన్నేసిన కబ్జాదారులకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతూ కబ్జా దారులకు కొమ్ము కాస్తున్న రెవెన్యూ అధికారులపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని హెచ్చరికా చేవారు. కబ్జాలపై ఎన్ని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి డెస్క్: పాయకరావుపేట శ్రీ ప్రకాష్ లో గురువారం స్కూలు కెప్టెన్, హౌస్ కెప్టెన్ల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 13 ఆంధ్రా ఎన్.సి.సి. బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని పేర్కొన్నారు. చదువుకునే వయస్సులో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. మంచి పౌరులుగా మారేందుకు నాయకత్వ లక్షణాలపై పట్టు సాధించాలని తెలిపారు.

విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు ఎవరి భవిష్యత్తుకు వారే మార్గదర్శకులన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్ ద్వారా ముఖ్య అతిథి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి -చీడికాడ: మహిళలు పొదుపుతోనే ఇంటిని అభివృద్ధి పరుస్తారని నాబార్డ్ ఏజీఎం జిఆర్ సంపత్ కుమార్ తెలిపారు. స్థానిక తులసి కళ్యాణ మండపంలో స్వాతి పరస్పర సహకార పొదుపు సంఘం 29వ మహాజనసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఏజీఎం మాట్లాడుతూ కుటుంబంలో మహిళలు డబ్బును పొదుపుగా వాడితే ఆ ఆర్థిక పటిష్టత ఉంటుందన్నారు. ఈ సంఘంలో సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి లాభాల బాటలో తీసుకెళ్లడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.నాబార్డ్ నుండి ఎటువంటి సహాయ సహకారం కావాలన్నా అందించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా డిఐసి జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆచార్య నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ముర్రు ముత్యాల నాయుడు, జిల్లా డిసిఐ ప్రేమ స్వరూపరాణి, మేనేజర్ దేముడమ్మ పాల్గొన్నారు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- రంపచోడవరం : సిజిఆర్ఎఫ్, ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో గురువారం రంపచోడవరం రూరల్ సబ్ డివిజన్‌కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడింది. సిజిఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డా:బి .సత్యనారాయణ, ఆర్థిక విభాగం సభ్యులు ఎం .శ్రీనివాస్, సాంకేతిక సభ్యులు వి .జనార్ధనరావు, స్వతంత్ర సభ్యులు డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్ పాల్గొని, రంపచోడవరం డివిజన్‌లో కరెంట్ వినియోగదారులసమస్యలను తెలుసుకున్నారు. ముందుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు విద్యుత్ వినియోగం మరియు తీసుకుకోవలసిన జాగ్రతల గురించి వివరించి విద్యుత్ సమస్యలు తలెత్తినపుడు సత్వర పరిష్కారం కొరకు 1912 ఫోన్ ద్వారా తెలియజేయమని వివరించారు. అనంతరం డివిజన్ కార్యాలయం నందు వినియోగదారల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరిగింది. సమస్యల పరిష్కారం కోసం అడ్డతీగల, నెల్లిపాక నుండి వచ్చిన వినియోగదారుల నుండి అర్జీలను స్వీకరించారు. అడ్డతీగల మండల కేంద్రంలో సబ్ స్టేషన్ ఉన్నప్పటికీ,విద్యుత్ సరఫరాకు తరచు అంతరాయం కలుగుతోందని వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్, పి. ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో రంపచోడవరం డివిజన్ సిబ్బంది డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, బి. దివాకర్ రావు, వై. మల్లిఖార్జున రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు బాధితులకు జమాల్‌ఖాన్ పరామర్శ

కూనవరం : మండలంలో కోతులగుట్ట పునరావాసం కేంద్రంలో ఉన్న వరద బాధితులను జెకెసిటి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మహ్మద్, ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ పరామర్శించి, పంద్రాజూపల్లి వద్ద రోడ్డుపై వరద నీరు ఉండటంతో ట్రాక్టర్‌పై వరద నీటిని దాటి వెళ్లారు. ఈసందర్భంగా తమకు గుడారాలు వేసేందుకు బరకాలు, నిత్యావసరాలు ఇవ్వలేదని బాధితులు గోడు వెల్లబుచ్చగా, ప్రభుత్వం ఇవ్వగా మిగిలిన వారికి తన ట్రస్ట్ ద్వారా సాయం చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం గిన్నెల బజారు, టేకుబాక, వెంకటాయపాలెం గ్రామాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. టిడిపి నేతలు ఎడవల్లి భాస్కరరావు, ఉమామహేశ్వరరావు, పోడియం అప్పారావు, బరపాటి ప్రకాశరావు, బొట్టు భాస్కరరావు, సూఫీ, ట్రస్ట్ సభ్యులు ఎస్‌కె.రియాజ్, రమణయ్య, యాకోబు, ఎస్‌కె షాజహాన్, షారుక్ పాల్గొన్నారు.

సూరకుంటలో మొక్కల నాటివేత

ప్రజాశక్తి - చింతూరు : సూరకుంట గ్రామంలో యూత్ ప్రెసిడెంట్ సోయం అర్జున్, సెక్రటరీ నూప కోటేష్, జాయింట్ సెక్రటరీ తోడం సుబ్బరాజు ఆధ్వర్యంలో గ్రామంలో 200 మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈనెల 21నకోయ భాష దినోత్సవం వచ్చేనెల9 ప్రపంచ ఆదివాసీల దినోత్సవం పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమంలో పేగా పంచాయితి సర్పంచ్ పాయం చంద్రయ్య , అల్లిగూడెం సిఆర్‌పిఎఫ్ క్యాంప్ 141 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చేతన్ బి.ఆర్, 42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ లలిత్ కుమార్ సిఆర్‌పిఎఫ్ బృందంపాల్గొని, స్థానిక గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. పేగా పంచాయతీ యూత్ సభ్యులు సోడే శ్రీను, గ్రామ పటేల్ తోడం చంద్రయ్య, కుంజ సంజీవ్ , మాజీ సర్పంచ్ సోడే ధర్మమ్మ పాల్గొన్నారు...

వరద బాధితులకు అన్నదానం

ప్రజాశక్తి- కూనవరం : వరద ముంచెత్తడంతో పునరావాస కేంద్రాలకు చేరిన వరద బాధితులకు జగ్గవరం గ్రామానికి చెందిన చంటిబాబు పోలీస్‌ల సహకారంతో భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్. ఐకె. శ్రీనివాస్ మాట్లాడుతూ చంటిబాబు సేవాభావాన్ని అభినందించారు. ప్రస్తుత తరుణంలో డెంగ్యూ, మలేరియా ప్రబలే అవకాశం ఉందని అందరూ దోమతెరలు వినియోగించాలని అన్నారు.

డొంకరాయి నుంచి నీరు విడుదల

ప్రజాశక్తి - సీలేరు: దిగుసీలేరు డొంకరాయి జలాశయం నుంచి 2173 క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతానికి ఏపీ జెన్కో అధికారులు బుధవారం అర్ధరాత్రి నుంచి విడుదల చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయం ఎగువనున్న పాలగెడ్డ, వలస గెడ్డ, పిల్ల కాలువలు, వాగులు, నుంచి భారీ వరద నీరు రావడంతో 8000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి డొంకరాయి నది లో చేరుతుంది. బుధవారం నాటికి 1335 అడుగులకు నీటిమట్టం పెరగడంతో జెన్కో అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్ వెనుక భాగం నుంచి గేట్ల ద్వారా గదివ ప్రాంతానికి నీటిని విడుదల చేసే ముందు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు గిరిజనులనుకు రాకపోకలు కొనసాగించవద్దని అప్రమత్తం చేస్తూ నోటీసులు జారీ చేసారు. బుధవారం అర్ధరాత్రికి రిజర్వాయర్లో 1336 అడుగులు నీటిమట్టానికి చేరువ కావడంతో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, డొంకరాయి ఇఇ పి.విజయ్‌కుమార్ ఆరో నెంబరు గేటు రెండు అడుగులు పైకి లేపి 2173 క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతాన్ని విడుదల చేశారు.



డొంకరాయి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

ఈ సందర్భంగా గురువారం ఇఇ విజయ్ కుమార్ మాట్లాడుతూ డొంకరాయి జరాశయము పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు కాగా బుధవారం అర్ధరాత్రి 10 36 అడుగు నీటిమట్టలు చెరువ కావడంతో ఎపి జెన్కో ఉన్నతాధికారి ఆదేశాల మేరకు 2173 క్యూసెక్కుల నీటిని దిగు ప్రాంతాన్ని విడుదల చేసే విధంగా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఇన్‌ఫ్లోస్ ఎక్కువగా నదిలో చేరడం లేదని కేవలం 4000 నుంచి 4500 క్యూసెక్కులు మాత్రమే చేరుతుందన్నారు. ప్రస్తుతం జలాశయంలో 1035.50 వద్ద నీటిమట్టాలు స్థిరంగా కొనసాగే విధంగా చర్యలు చేపట్టి దిగు ప్రాంతాన్ని నీటిని విడుదల చేస్తున్నామన్నారు. జలాశయం నుంచి డొంకరాయి పవర్ కెనాల్ ద్వారా పోల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 3000 వేలు క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని ఈఈ విజయ్ కుమార్ వెల్లడించారు. డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో 13.80 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. ఇన్‌ఫ్లోస్ తగ్గుముఖం పట్టి జలాశయంలో నీటిమట్టాలు తగ్గితే గేట్లు ద్వారా దిగు ప్రాంతానికి విడిచి పెట్టే నీటిని నిలుపుదల చేస్తామన్నారు.

మూగజీవాలకు వైద్యసేవలు

ప్రజాశక్తి -సీలేరు: వర్షాకాలంలో పశువులు, మేకలకు వచ్చే వ్యాధులు పట్ల పెంపకందారులు అప్రమత్తంగా వ్యవహరించాలనిసీలేరు సచివాలయ పశుసంవర్థక సహాయకురాలు జ్వరంగి అనుష్క వెల్లడించారు. గురువారం పార్వతినగర్ సమీపంలో పసుపు లంక వద్ద జలుబు దగ్గుతో బాధపడుతూ అనారోగ్యానికి గురైన ముద్దాన లక్ష్మణకు చెందిన 50 మేకలకు వైద్యసేవలు అందించారు. మూగజీవాలకు అనారోగ్యం చేస్తే, వ్యాధి తీవ్రతరమైనంత వరకు జాప్యం చేయకుండా వెంటనే దగ్గరలోని పశువైద్యకేంద్రానికి తీసుకెళ్లి వైద్యసేవలు అందించాలని అన్నారు.

గ్రాసానికి పశువులు కటకట

ప్రజాశక్తి -సీలేరు: ఏజెన్సీ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో మూగజీవాలు పరిస్థితి దయనీయంగా మారింది. కొన్నాళ్లుగా పశుగ్రాసానికి మూగజీవాలు బయటికి వెళ్లలేని స్థితి ఏర్పడింది. మారుమూల గ్రామాల్లో రహదారులన్నీ కొట్టుకుపోయి, కాలువలు గడ్డలు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర. బాలయ్య మాట్లాడుతూ, మూగజీవాలకు మేతకు అవసరమైన సహకారాన్ని అందిచాలని కోరాఉ. ఇదే సమయంలో గిరిజనులు ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగుల వద్ద సాహసోపేత చర్యలకు దిగరాదన్నారు. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మన్యవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

విద్యుత్ వైర్లపై కూలిన భారీవృక్షం

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు ఎపి జెన్‌కో కాలనీ మూడో క్రాస్‌రోడ్‌లో భారీ వక్షం కూకటి వేళ్ళతో విద్యుత్ తీగలపై కూలిపోయింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరా ఉన్న వైర్లపై చెట్టు పడడంతో సరఫరా ట్రిప్ అయిపోయింది. గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఏపీ జెన్కో ఎడిఇ అప్పారావు, సబ్ ఇంజనీర్ నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం ఫోర్‌మెన్ లామా, ఓబి కాంట్రాక్ట్ కార్మికులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. మూడు గంటల పాటు శ్రమించి విద్యుత్తు లైను సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

ప్రజాశక్తి - మారేడుమిల్లి: మన్యంలో కురుస్తున్న వర్షాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరోగ్య రీత్యా ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ అలెర్ట్ ప్రకటిస్తూ, పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవులు ప్రకటించినా,మారేడుమిల్లి మండలంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలల్లో ఆరు రోజులు సెలవుదినాలను హెచ్‌ఎంలు అమలు చేయలేదు. దీంతో ఉపాధ్యాయులు వర్షాలకుఇబ్బందులు పడుతూ, పాఠశాలకు వెళ్లి వచ్చారు. కలెక్టర్ ఆదేశించినా,. ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంలు వాటిని అమలు చేయకపోవడం సరికాదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రెసిడెంట్ ఎం మంగిరెడ్డి, స్టేట్ కౌన్సిలర్ పి బాల్ రెడ్డి ఆరోపించారు.

చిల్డ్రన్స్ థియేటర్‌లో సినిమాలు వేయాలని వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నంలోని సిరిపురంలోగల విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల సినిమాలు వేయాలని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం విఎంఆర్‌డిఎ కార్యాలయంలో కమిషనర్ కెఎస్.విశ్వనాథన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా చిల్డ్రన్స్ థియేటర్‌లో బాలల కార్యక్రమాలు నిలిపివేసి కేవలం ప్రైవేట్, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణకు పరిమితం చేయడంపై విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ సహాయ కార్యదర్శి డాక్టర్ బాబ్జి పాల్గొన్నారు

కూనవరం సిహెచ్‌సిలో తొలి సిజేరియన్ సక్సెస్

ప్రజాశక్తి- కూనవరం : మండలం కోతులగుట్ట సిహెచ్‌సిలో గురువారం ప్రసవ వేదన పడుతున్న ఒక గర్భిణికి స్పెషలిస్టు వైద్యులు విజయవంతంగా సిజేరియన్ ఆపరేషన్ నిర్వహించారు. కూనవరం ఉదయభాస్కర్ కాలనీకి చెందిన బర్ల శ్రావణి అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో వైద్యులు ఆమెకు సిజేరియన్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. భద్రాచలం గానీ చింతూరు, రంపచోడవరం ఆసుపత్రులకు పంపించాలన్నా చుట్టు రహదారులపై వరద మీరు ఉండడంతో ఇబ్బంది ఏర్పండింది. దీంతో కూనవరం సిహెచ్‌సి సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ మహేష్‌బాబు గర్భిణికి కూనవరంలోనే సిజేరియన్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించుకున్నారు. ఆయన నేతత్వంలో కూనవరం గైనకాలజిస్టు డాక్టర్ పి.శ్వేత, రంపచోడవరం ఎనస్థీషియా వైద్యాధికారులు డాక్టర్.పద్మావతి సీనియర్ వైద్యులు డాక్టర్ టీవీ శేషిరెడ్డి సిజేరియన్ ఆపరేషన్ చేశారు. సిజేరియన్ ఆపరేషన్ విజయవంతంగా జరిగిందని, తల్లి, మగబిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. మహేశ్‌బాబు తెలిపారు. కూనవరం ప్రభుత్వ ఆసుపత్రులో మొదటిగా నిర్వహించిన ఆపరేషన్ విజయవంతం కావడంతో వైద్యాధికారులు వైద్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేసారు. వరదల సమయంలో గర్భిణులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూనవరం సిహెచ్‌సికి స్పెషలిసు వైద్యులను పంపించిన జిల్లా కలెక్టర్, డీసీహెచ్‌ఎస్‌లకు స్థానికులు, గర్భిణి సంబంధీకులు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు భద్రాచలం, చింతూరు, రంపచోడవరం ఏరియా ఆసుపత్రులలో మాత్రమే సీజేరియన్ ఆపరేషన్‌లు జరిగేవి. ఇకపై కూనవరం సీహెచ్‌సీలో కూడా అందుబాటులోకి రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆపరేషన్‌కు హెడ్ నర్స్ బి.బొజ్జి, స్టాఫ్‌నర్స్ కె. పలీనా, వై.అనసూర్య, సిబ్బంది సుబ్బయ్య, జీవన్, అఖిల్ సహకరించారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

కూనవరం : ముంపు బాధితులు పునరావాసం పొందిన కేంద్రాల్లో తాగునీరు, ఇతర సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని గిరిజన సంఘం నాయకుడు బాబు బొర్రయ్య ఆరోపించారు. ఇంతకుముందు నిర్వహించిన గ్రామసభల్లో అధికారుల దృష్టికి తాగునీరు, ఇతర సమస్యలను తీసుకెళ్లినా, వాటిని కల్పించడంలో విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈఏడాది వర్షాకాలంలో తొలిరోజుల్లోనే పరిస్థితి ఇలా ఉండగా, మున్ముందు వర్షాలు, వరద ఉధృతి మరింతగా ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా స్పందించి, తగు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మడకం బుజ్జి, స్థానిక సర్పంచ్ నాగమణి ఉన్నారు



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం ప్రజా ప్రతినిధులు

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి - కూనవరం : మండలంలోని పలు సమస్యలపై మండలలోని సిపిఎం ప్రజా ప్రతినిధులుఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి చైతన్యను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య మాట్లాడుతూ, మండలంలో రేషన్ కార్డుదారులకే కాకుండా ముంపు బాధితులు అందరికీ య్యాన్ని అందించాన్నారు. మండలంలో విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సరివెల నుండి చిన్నార్కూర్‌కు విద్యుత్ లైన్ కలిపితే అన్నీ గ్రామాలకు కరెంట్ సరఫరా జరుగుతుందన్నారు. బాధితులకు బరకాలు అందజేయాలని కోరారు. దీనిపై పిఒ స్పందిస్తూ, గోదావరివ ముంపు బాధితులకు మాత్రమే బరకాలు ఇస్తున్నామన్నారు. కూటూరు పిహెచ్‌సిలో తక్షణమే జనరేటర్ ఏర్పాటు చేయాలని అందేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోడే శంకర్, బొగ్గా వెంకమ్మ పాల్గొన్నారు.